క్లుప్తంగా

బ్రహ్మాజీకి అభినందనలు



బ్రహ్మాజీని అభినందిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: వైఎస్సార్ సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ చేతివృత్తుల విభాగ అధ్యక్షుడిగా నియమితులైన టేకు లక్ష్మణరావు (బ్రహ్మాజీ)ను రణస్థలం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడినవారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రణస్థలం వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, ఎంపీటీసీ పచ్చిగుళ్ల సాయిరాం, ఉప సర్పంచ్ దన్నాన సీతారాం, నాయకులు పాల్గొన్నారు.

11న ఆటో, మ్యాక్సీ డ్రైవర్ల ధర్నా



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

రణస్థలం: మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల ఉపాధి కోల్పోతున్న ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి రూ.30 వేలు చెల్లించాలని కోరుతూ ఈ నెల 11న శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం రణస్థలంలో కరపత్రాలు ఆవిష్కరించి ప్రచారం నిర్వహించారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ చట్టం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే యూరియా కొరత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల : ఖరీఫ్ పంటలకు యూరియా అత్యవసరమని తెలిసి కూడా కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇండెంట్‌లు పెట్టక కొరత ఏర్పడిందని, అరకొరగా వచ్చిన యూరియాను కూటమి నాయకులు పంచుకుంటున్నారని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. మంగళవారం ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. విద్యుత్ సమస్యలు తరచుగా వస్తున్నందున సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మండల పరిషత్ నిధులతో చేపట్టిన పనులను అధికారులు త్వరగా రికార్డు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో హరిహరరావు, మండల శాఖ అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సేవలకు సత్కారం



లక్ష్మణరావు, రవిలను సత్కరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ బలగ రవి, మెట్టవలస వీఆర్‌ఓ తాలాడ లక్ష్మణరావుల సేవలను గుర్తించి కలెక్టర్ ఇటీవల ఉత్తమ సేవకులుగా అవార్డులు అందజేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహాదేవు సరిత, డీటీలు ఎస్.నిర్మల, కె.గాయిత్రి, వీఆర్‌ఓలు భూపతి నర్సింగరావు, పాట్నూరు జగన్నాథం, కుప్పిలి సీతయ్య, ముద్దాడ నీలకంఠ, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు సన్మానం



అధ్యాపకులను సన్మానిస్తున్న దృశ్యం

జి.సిగడాం: స్థానిక మోడల్ స్కూల్లో విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యేల్ లెంక, అధ్యాపకులు మజ్జి ఈశ్వర్‌నాయుడు, వల్లూరు గణేష్, ఉషారాణి, మామిడి లక్ష్మణరావులను మంగళవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.గణేష్ పట్నాయక్, ఉపాధ్యాయులు కోట తిరుపతిరావు, రవికుమార్, సుబ్రహ్మణ్యం నేతాజీ, ముత్యాలరావు, అరుణకుమారి, నాగమణి, ప్రమీల పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెరగాలి

నరసన్నపేట/సారవకోట: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు పెరగాలని, అధ్యాపకులు మరింత బాధ్యతగా పనిచేయాలని డీవీఈఓ సురేష్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పోటీ పరీక్షల మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నరసన్నపేట, సారవకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఆర్‌ఐఓ పి.దుర్గారావుతో కలిసి పరిశీలించారు.

అడుగడుగునా నిర్బంధం..

నిరంకుశ పాలనకు నిదర్శనం

- యూరియా, ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం
- అన్నదాత పోరు నిరసన కార్యక్రమంలో నాయకుల మండిపాటు



శ్రీకాకుళం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు గొండు రఘురాం, ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు తదితరులు



రణస్థలం: అన్నదాత పోరులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, నాయకులు

రణస్థలం: రైతులకు యూరియా, ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలం మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మంగళవారం చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. రణస్థలం, లావేరు, జి.సిగడాం ఎస్సైలు, ప్రత్యేక బలగాలు తరలివచ్చి మాజీ ఎమ్మెల్యేను ఇంటివద్దే నిర్బంధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మద్దతుగా పోరాటం చేస్తుంటే పోలీసులు అడ్డుకోవడం నిరంకుశపాలనకు నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలంలో రైతులను నట్టేట ముంచిందన్నారు. ఎరువులను రైతు సేవా కేంద్రాల ద్వారా నేరుగా రైతులకు అందించకుండా బ్లాక్ మార్కెట్ ద్వారా అధిక ధరకు అమ్మకాలు జరుపుతున్నారని మండిపడ్డారు. యూరియాను రైతులకు కాకుండా కూటమి నాయకులే పంచుకుంటున్నారని విమర్శించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాలుగు మండలాల నాయకులు, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్రంలో రైతుల పరిస్థితి దీనంగా ఉందని, సకాలంలో యూరియా అందక ఖరీఫ్ పంటను కోల్పోయే పరిస్థితి వచ్చిందని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొండు రఘురాం అన్నారు. ఈ మేరకు ఎరువుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శ్రీకాకుళం ఆర్డీవో కార్యాలయం వద్ద ఏఓ లక్ష్మీనారాయణకు పార్టీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడుతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యూరియా బ్లాక్ మార్కెటింగ్ అరికట్టాలన్నారు. రైతు సమస్యలను అధికారులకు చెప్పుకునేందుకు వస్తుంటే ఆంక్షలు పెట్టడం సరికాదన్నారు. అధికారులు యూరియా నిల్వలు ఉన్నాయని చెపుతున్నారని, అలాంటప్పుడు రైతులకు ఎందుకు అందడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ,అంబటి శ్రీనివాసరావు, మూకళ్ల తాతబాబు, గొండు కృష్ణమూర్తి, పీస గోపి, మార్పు పృథ్వీ, గేదెల పురుషోత్తం, వై.వి.శ్రీధర్, సాధు వైకుంఠరావు, బగ్గు అప్పారావు, రావాడ జోగినాయుడు, రౌతు శంకరరావు, ముంజేటి కృష్ణమూర్తి, యజ్జల గురుమూర్తి, టి.కామేశ్వరి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంరూరల్: మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుతోపాటు ఆయన కుమారుడు రామ్‌మనోహర్‌నాయుడును పెద్దపాడు క్యాంపు కార్యాలయం వద్ద హౌస్ అరెస్టు చేశారు. శ్రీకాకుళం రూరల్ పోలీసులు తెల్లవారుజామున చేరుకుని ఇద్దరినీ ఇంటి నుంచి బయటకు వెళ్లనివ్వలేదు.

గార: రైతులకు ఎరువులు అందించాలన్న డిమాండ్‌తో శాంతియుత ధోరణిలో వినతిపత్రం అందించేందుకు చేపట్టిన 'అన్నదాత పోరు'కు వెళ్లకుండా హౌస్ అరెస్టులు చేయటం దారుణమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ గొండు రఘురాం అన్నారు. మంగళవారం ఉదయం అంపోలులో తన స్వగృహం వద్ద పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. గారలో వైఎస్సార్ సీపీ జిల్లా యువత అధ్యక్షుడు మార్పు పృథ్వీరాజును గృహ నిర్బంధం చేశారు.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రైతుల తరపున ప్రశ్నించే వారిని గొంతు నొక్కేయాలని చూడటం సరికాదని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వి.స్వరూప్ అన్నారు. ఆర్డీఓకు వినతి పత్రం ఇచ్చేందుకు బయలుదేరిన స్వరూప్‌ను మంగళవారం గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమను నిర్బంధించడం అంటే రైతుల్ని నిర్బంధించడమేనన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నదాతలను అడుగడుగున ఆంక్షలు విధించి ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. స్వరూప్‌తో పాటు ఎం.బేగ్, భైరి మురళి, కింజరాపు రమేష్, కరంచంద్, శోభన్ తదితరులున్నారు.

జి.సిగడాం : యూరియా సకాలంలో పంపిణీ చేయాలని బాతువ వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, ఎంపీటీసీ సభ్యుడు బూటు అప్పారావు, మాజీ సర్పంచ్ గ్రామకమిటీ అధ్యక్షుడు పల్లేడ సన్యాసిరావు, యువనాయకులు మీసాల కన్నంనాయుడు కోరారు. ఈ మేరకు పార్టీ కార్యకర్తలతో కలిసి సచివాలయం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం అగ్రికల్చర్ అసిస్టెంట్ షేక్ ఆయాష్ బేగమ్‌కు వినతిపత్రం అందించారు.

ఎచ్చెర్ల : రైతులకు సకాలంలో ఎరువులు సరఫరా చేయాలని కోరుతూ లావేరు మండలం బెజ్జిపురం, అదపాక సచివాలయాల వద్ద మంగళవారం ధర్నాలు నిర్వహించారు. బెజ్జిపురం సచివాలయం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దన్నాన రాజినాయుడు ఆధ్వర్యంలో నినాదాలు చేశారు. అనంతరం సిబ్బందికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొర్లె అప్పలనాయుడు, ఎంపీటీసీ గంట్యాడ సత్యం , జిల్లా స్టూడెంట్ వింగ్ జాయింట్ సెక్రటరీ నడిమింటి సునీల్, రైతులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం రూరల్: ధర్మాన రామ్‌మనోహర్ నాయుడును హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు



గార: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ గొండు రఘురాంను హౌస్ అరెస్టు చేసిన దృశ్యం



గార: డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తిని హౌస్ అరెస్టు చేసిన దృశ్యం



ఎచ్చెర్ల: లావేరు మండలం బెజ్జిపురంలో ధర్నా నిర్వహిస్తున్న రైతులు



అదపాకలో సచివాలయం సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న రైతులు



జి.సిగడాం: బాతువ సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తంగి సేవలు వెలకట్టలేనివి



తంగి సత్యనారాయణ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు తదితరులు

శ్రీకాకుళం రూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్, మాజీ రెవెన్యూ శాఖ మంత్రి తంగి సత్యనారాయణ సేవలు వెలకట్టలేనివని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు కొనియాడారు. తంగి సత్యనారాయణ జయంతి సందర్భంగా మంగళవారం కొత్త బ్రిడ్జి సమీపంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, తంగి చంద్రశేఖర్, తంగి వేణుగోపాలరావు, తంగి శ్రీపతి, తంగి శివప్రసాద్, తంగి ఈశ్వరరావు, తంగి రవికుమార్, శ్రీనివాసరావు, జనార్దనరావు, సీనియర్ నాయకులు అంబటి శ్రీనివాసరావు, గొండు కృష్ణమూర్తి, గొండు రఘురామ్, ఎచ్చెర్ల శ్రీధర్, మూకల్ల తాతబాబు, అల్లు లక్ష్మీనారాయణ, గంగు నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దివంగత మాజీ స్పీకర్ తంగి సత్యనారాయణ 95వ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ తంగి చంద్రశేఖరరావు, వంశీ, బార్ అధ్యక్ష కార్యదర్శులు తంగి శివప్రసాద్, పిట్టా దామోదరరావు పాల్గొన్నారు.

ధర్మానను కలిసిన ఎస్సీ సెల్ నాయకులు



ఎస్సీసెల్ నాయకులతో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్ : మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావును జిల్లా ఎస్సీసెల్ నాయకులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నాడ రుషి ఆధ్వర్యంలో మంగళవారం పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 17న జిల్లాలో నిర్వహించబోయే ఎస్సీసెల్ ఎగ్జిక్యూటివ్ సమావేశానికి సంబంధించి పలు సూచనలు, సలహాలను ఆయన వివరించారు. ప్రతి ఒక్కరూ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విశాఖపట్నం కార్పొరేటర్, ఎస్సీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రొయ్యి వెంకటరమణ, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృష్ణ, యజ్జల గురుమూర్తి, పెయ్యల లక్ష్మణరావు, రామినాయుడు, నేతల లక్ష్మణరావు, ఎడ్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.

బోధనేతర భారం తగ్గించాలి



పాఠశాలలో ఏపీటీఎఫ్ సభ్యులు

ఎచ్చెర్ల : ఉపాధ్యాయులపై బోధనేతర పనిభారం తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యులు కోరారు. మంగళవారం ఎచ్చెర్ల మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండిగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పరీక్షల విధానాన్ని సమీక్షించాలని, అసైన్మెంట్ల పుస్తకాల నిర్వహణ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తలకు మించిన భారంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బల్లాడ రవి, ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, నవీన్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

దత్త క్షేత్రంలో విజయానంద తీర్థ



భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న స్వామీజీ

శ్రీకాకుళం కల్చరల్ : చాతుర్మాస్య వ్రత పరిసమాప్త విశ్వరూప విజయ యాత్రలో భాగంగా దత్త విజయానంద తీర్థ స్వామీజీ బుధవారం శ్రీకాకుళంలోని కొత్త బ్రిడ్జి వద్ద ఉన్న దత్తనాథ క్షేత్రం ఆలయాన్ని దర్శించారు. ఈ సందర్భంగా స్వామీని మాట్లాడుతూ దత్తక్షేత్రం నూతన భవనాలు అభివృద్ధి చేయాలని, భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని, దేవతామూర్తులు అన్ని ఒకేచోట ఉంటే భక్తులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఈ నెల 14 వరకు ఉత్తరాంధ్రలో గ్రామ పర్యటన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



సర్వేశ్వరపురంలో తనిఖీలు చేస్తున్న జేసీ

జి.సిగడాం: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ హెచ్చరించారు. మంగళవారం బాతువ సర్వేశ్వరపురం గ్రామాల్లో ఎరువుల షాపులను తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సక్రమంగా ఎరువులను పంపిణీ చేయాలన్నారు. నిబంధనలు పాటించని షాపులను సీజ్ చేస్తామన్నారు.

కార్మిక, కర్షక వర్గాల మార్గదర్శి సురవరం



సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కార్మిక, కర్షక వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి అని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ అన్నారు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి జీవితాంతం ప్రజల కోసం పనిచేశారని కొనియాడారు. శ్రీకాకుళం నగరంలోని క్రాంతిభవన్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అధ్యక్షతన మంగళవారం సుధాకరరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే కమ్యూనిజం భావజాలం పట్ల ఆకర్షితులై విద్యార్థి సంఘ నాయకునిగా, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి దేశంలోని ఎన్నో పోరాటాల్లో కీలక భూమిక పోషించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోజ్జాడ యుగంధర్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోనారి మోహనరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చాపర సుందర్‌లాల్, కొన్న శ్రీనివాసరావు, పుక్కల్ల అరేలమ్మ, ఎస్.నారాయణ స్వామి, ఎస్.హరికృష్ణ, బొత్స సంతోష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు సీహెచ్ రవి, జిల్లా సమితి సభ్యులు టి.తిరుపతిరావు, దూసి శారద, లక్కోజి శ్రీనివాసరావు, సవర రమేష్, ఏం.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రణభేరి విజయవంతం చేయాలి

నరసన్నపేట: ఆర్థిక, విద్యా రంగ సమస్యలపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 15 నుంచి 19వ తేదీ మధ్య నిర్వహించనున్న రణబేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి అన్నారు. రణబేరి క్యాంపైన్‌లో భాగంగా మండలంలోని తామరాపల్లిలో రణబేరి పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు.

బాబోయ్ కుక్కలు



శ్రీకాకుళం ఆర్‌కే నగర్‌కాలనీలో కుక్కల గుంపు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నగరంలో కుక్కల సంచారం ఎక్కువైంది. గుంపులుగుంపులుగా తిరుగుతూ నగరవాసుల్ని కలవరపెడుతున్నాయి. రాత్రీ పగలు తేడా లేకుండా వెంటాడుతున్నాయి. ద్విచక్ర వాహనచోదకులు, కార్ల వెంట పరుగులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కుక్కలను నియంత్రిస్తున్నామని కార్పొరేషన్ అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా ఉంటోంది. ఏ వీధి చూసినా కుక్కల గుంపులే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

'ఆశ' నిరాశేనా?



బాతువ ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా కార్యకర్తలు

- చాలీచాలన జీతంతో ఆశా కార్యకర్తల ఇక్కట్లు
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి



గ్రామాల్లో జ్వర పీడితులకు సూచనలిస్తూ..

జి.సిగడాం: గ్రామస్థాయిలో రోగులకు ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా.. ప్రధానంగా గర్భిణులకు అన్నివేళలా అండగా నిలిచే ఆశా కార్యకర్తలకు భరోసా కరువైంది. చాలీచాలని వేతనాలతో జీవనం కష్టమవుతోంది. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన నాయకులు కూటమి ప్రభుత్వం వచ్చాక అమలు చేయకుండా పట్టించుకోవడం మానేశారు. దీంతో ఆశా కార్యకర్తలు అవస్థలు పడుతున్నారు. గౌరవ భృతి తక్కువ పని భారం ఎక్కువ కావడంతో ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా తమ సమస్యలు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు..

అమలు చేయాలి..

ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి ఆదుకోవాలి. గ్రామస్థాయిలో అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నా సరైన గుర్తింపు లేదు.

– బి.గీత, ఆశా కార్యకర్త, జాడ

జీతాలు పెంచాలి..

గ్రామాల్లో ఎవరికి ఆరోగ్యం బాగా లేకపోయినా ముందుండేది ఆశా కార్యకర్తలే. మాకు మాత్రం సరైన వేతనాలు ఇవ్వడం లేదు. చాలీచాలని వేతనాలతో కుటుంబం పోషణ కష్టంగా ఉంది.

– ఎం.భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్త, ఎందువ

గుర్తించాలి..

ఆశా కార్యకర్తల వ్యవస్థ ఏర్పాటైనప్పటి నుంచి పల్లెల్లో వైద్యసేవలు అందిస్తున్నాం. అయినా గుర్తింపు ఉండటం లేదు. పాలకులు స్పందించి మమ్మల్ని గుర్తించాలి.

– సుశీల, ఆశా కార్యకర్త, బాతువ

పాలకులు స్పందించాలి..

ప్రస్తుతం పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను దృష్టిలో పెట్టుకుని నెలకు కనీసం రూ.20 వేలు చెల్లించాలి.

–హేమ, ఆశా కార్యకర్త, వెంకయ్యపేట